క్లుప్తంగా

మెప్మా ఆర్పీలకు జీతాలు చెల్లించాలి



కలెక్టరేట్ వద్ద ఏపీ మెప్మా ఉద్యోగుల ధర్నా

కర్నూలు(సెంట్రల్): మెప్మా ఆర్పీలకు పెండింగ్‌లో ఉన్న ఆరు నెలల జీతాలను వెంటనే చెల్లించాలని మెప్మా ఆర్పీల సంఘం జిల్లా కార్యదర్శి ఉమాదేవి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్పీలు ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్పీలకు నెలనెలా జీతం ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్పీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, టీఏలు ఇవ్వాలని, సీఓ, డీఈఓ పదోన్నతి కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కేఎంసీ గైనిక్ విభాగం ప్రతిభ



అసిస్టెంట్ ప్రొఫెసర్లు, పీజీలను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ

కర్నూలు(హాస్పిటల్): ఇటీవల కర్నూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇన్‌ఫెర్టిలిటీ సదస్సులో స్థానిక మెడికల్ కాలేజీ గైనిక్ విభాగం వైద్యులు ప్రతిభ చూపారు. ఐఏఎస్ఆర్ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు నిర్వహించిన సదస్సులో కేఎంసీ గైనకాలజీకి చెందిన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఇద్దరు పీజీలకు పేపర్ ప్రజెంటేషన్, పోస్టర్ ప్రజెంటేషన్ విభాగాల్లో బహుమతులు వచ్చాయి. సోమవారం అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ సుప్రియ, డాక్టర్ ప్రియ, పీజీలు షారూన్, మనీషాలను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ అభినందించారు. కార్యక్రమంలో గైనకాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ శ్రీలక్ష్మి, ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

అభినందన



జ్ఞాపిక అందజేస్తున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): విజయవాడ వరదల్లో సేవలు అందించిన ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ నాయకులను సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పి.నిర్మల అభినందించారు. సోమవారం ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యాలయంలో ఆమె సేవలందించిన వారికి జ్ఞాపికలను అందజేశారు.

గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా నాగరాజు

కర్నూలు (టౌన్): గూడూరు నగర పంచాయతీ కమిషనర్‌గా నాగరాజు ప్రభుత్వం నియమించింది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్న ఆయనను గూడూరు కమిషనర్‌గా నియమిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది.

టౌన్ ప్లానింగ్‌లో...

నగరపాలక పట్టణ ప్రణాళిక విభాగంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ ఎస్.రంగస్వామిని నందికొట్కూరు మున్సిపాలిటీకి, మరో అసిస్టెంట్ సిటీ ప్లానర్ జి.శశిలతను కర్నూలు జిల్లా పట్టణ, గ్రామీణ ప్రణాళిక విభాగం కార్యాలయానికి, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ పి.మంజులమ్మను అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్‌కు, మరో టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ పి.శబరీష్‌ను డోన్ మున్సిపాలిటీకి, డోన్ మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ షేక్ అహమ్మద్‌బాషాను కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్‌కు ప్రభుత్వం బదిలీ చేసింది.

కుడా జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్ బదిలీ..

కుడా (కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)లో జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న రాజేష్ ఎమ్మిగనూరు మున్సిపాలిటీకి బదిలీ చేశారు. గ్రేడ్–2 మున్సిపల్ కమిషనర్‌గా పనిచేస్తూ పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న మహమ్మద్ షేక్ మాలిక్‌ను కుడా పరిపాలన అధికారిగా నియమించింది.

సూపర్ సిక్స్ అమలులో బాబు విఫలం



మాట్లాడుతున్న డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ

కర్నూలు(సెంట్రల్): సీఎం చంద్రబాబు నాయుడు సూపర్‌సిక్స్ పథకాలను అమలు చేయడంలో విఫలమయ్యారని డీసీసీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ విమర్శించారు. 100 రోజుల పాలనను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 25న థాలి భజావో(ప్లేట్లను గరిటేలతో కొట్టడం) నిరసన తెలపనున్నామన్నారు. సోమవారం డీసీసీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. థాలి భజావో నిరసన కార్యక్రమాన్ని డీసీసీ కార్యాలయంతో పాటు అన్ని నియోజకవర్గాల్లో చేపట్టాలని పార్టీ అనుబంధ సంఘాల నాయకులకు సూచించారు. సమావేశంలో సిటీ అధ్యక్షుడు జిలానీ బాషా తదితరులు పాల్గొన్నారు.

దంచి కొట్టిన వర్షం



పనులు చేయిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు



నగరంలో భారీ వర్షం కురుస్తున్న దృశ్యం

- గడియారం ఆసుపత్రిలోకి వర్షపు నీరు
- ఇబ్బందులు పడిన రోగులు
- పొంగిపొర్లిన సుద్దవాగు
- నిలిచిన రాకపోకలు

కర్నూలు (టౌన్): నగరంలో సోమవారం వర్షం దంచి కొట్టింది. మధ్యాహ్నం 1 నుంచి 2:30 గంటల వరకు భారీ వర్షం పడటంతో నగర వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అత్యవసర పనులున్న కొందరు వాహనదారులు జోరు వానలోనే ప్రయాణాలు సాగించారు. భారీ వర్షానికి సుద్దవాగు పొంగడంతో గణేష్, నగర్ ఫోర్త్ క్లాస్ ఎంప్లాయీస్ కాలనీలకు అరగంట పాటు రాకపోకలు నిలిచిపోయాయి. ఇక కిడ్స్ వరల్డ్, విద్యానగర్, గాంధీనగర్ వరకు వర్షపు నీరు రోడ్లపై నిలిచిపోవడంతో వాహనాదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. ట్రాఫిక్ సమస్య కూడా తలెత్తింది. పాతబస్తీలోని గడియారం ఆసుపత్రిలోకి ఏకంగా వర్షపు నీరు చేరుకోవడంతో రోగులు ఆందోళనకు గురయ్యారు. ప్రధాన మురుగు కాల్వలు సక్రమంగా శుభ్రం చేయకపోవడంతో వర్షపు నీరు రహదారులపైనే నిలిచిపోతోంది. ఆర్ఎస్ రోడ్డులోను, మెడికల్ కళాశాల వద్ద వర్షపు నీరు నిలిచింది. స్థానికులు నగరపాలక అధికారులకు ఫిర్యాదు చేయడంతో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. మున్సిపల్ పారిశుద్ధ్య సిబ్బందితో మురుగు కాల్వల్లో పేరుకుపోయిన చెత్తచెదారం తొలగించారు. సమాంతర డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఈ సమస్య వస్తోందని నగర వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వర్షం వెలిసిన తర్వాత సుద్దవాగులో నుంచి కొట్టుకొచ్చిన చెత్తచెదారం



జోరు వానలో వాహనాల రాకపోకలు సాగిస్తున్న దృశ్యం

నైపుణ్యం మెరుగుపర్చుకోవాలి

- హోంగార్డు కమాండెంట్ మహేష్ కుమార్

కర్నూలు: హోంగార్డులు విధుల్లో నైపుణ్యం మెరుగుపరచుకుని క్రమశిక్షణతో సమర్థవంతంగా పనిచేయాలని సదరన్ రీజియన్ హోంగార్డు కమాండెంట్ మేకల మహేష్‌కుమార్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయ పరేడ్ మైదానంలో నిర్వహించిన హోం గార్డ్స్ పరేడ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించి పోలీసు శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉంటూ ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. జీవిత బీమాలో పాలసీలు చేయించుకోవాలని, ప్రతి ఒక్క కమాండెంట్ డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఇన్సూరెన్స్ రెన్యూవల్ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హోంగార్డు డీఎస్పీ కృష్ణమోహన్, ఆర్ఐ జావిద్ పాల్గొన్నారు.



పరేడ్‌ను పరిశీలిస్తున్న సదరన్ రీజియన్ కమాండెంట్ మహేష్ కుమార్

జనసేన ఎమ్మెల్యే నానాజీపై చర్యలు తీసుకోవాలి



నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న వైద్యులు

కర్నూలు(హాస్పిటల్): కాకినాడలోని రంగరాయ మెడికల్ కాలేజీ ప్రొఫెసర్ డాక్టర్ ఉమామహేశ్వరరావుపై దాడికి పాల్పడిన జనసేన ఎమ్మెల్యే పంతం నానాజీపై కఠిన చర్యలు తీసుకోవాలని వైద్యులు డిమాండ్ చేశారు. ఏపీ ప్రభుత్వ వైద్యుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఓల్డ్‌క్లినికల్ లెక్చర్ గ్యాలరీ ముందు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు డాక్టర్ పి.బ్రహ్మాజీ మాస్టర్ మాట్లాడుతూ సౌమ్యుడైన డాక్టర్ ఉమామహేశ్వరరావుపై, అక్కడి వైద్య విద్యార్థులపై ఎమ్మెల్యేతోపాటు అతని అనుచరులు విచక్షణారహితంగా దాడి చేయడాన్ని ఖండిస్తున్నట్లు తెలిపారు. దాడి చేసిన ఎమ్మెల్యే, అతని అనుచరులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు భవిష్యత్ కార్యాచరణ నిర్ణయిస్తామన్నారు. కార్యక్రమంలో సంఘం జనరల్ సెక్రటరీ డాక్టర్ దమామ్ శ్రీనివాస్, ఏపీ అకాడమి ఆఫ్ ఫోరెన్సిక్ మెడిసిన్ అండ్ టాక్సికాలజీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ సాయిసుధీర్, డాక్టర్ విజయానంద బాబు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కార్మికులను బానిసలుగా మార్చే లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని ఏఐటీయూసీ, సీఐటీయూ, ఏఐయూటీయూసీ, ఏఐకేఎస్ డిమాండ్ చేశాయి. మోదీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 44 కార్మిక చట్టాలను 4 లేబర్ కోడ్‌లుగా కుదించడంతో కార్మికుల బతుకులు బానిసల కంటే హీనంగా మారిపోయాయని ఆయా సంఘాల కార్యదర్శులు మునెప్ప, ఎండీ అ ంజిబాబు, నాగన్న, శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం కార్మికులు, రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ లేబర్ కోడ్‌లతో కనీస వేతనం, ఎనిమిది గంటల పని విధానం, యూనియన్ల ఏర్పాటు, ఉద్యోగభద్రత, సమ్మె హక్కులు ప్రశ్నార్థకంగా మారాయన్నారు. కార్పొరేట్ సంస్థలకు మేలు చేయడం కోసమే ఐఎల్ఓలో భాగస్వామిగా ఉన్న భారత్ లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ఆమోదించిన కనీస వేతన చట్టం రూ.26 వేలు నెలసరి వేతనం ఇవ్వాలని సిఫార్స్ చేసినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయడం లేదన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులకు కూడా కనీస వేతనం రూ.26 వేలతోపాటు పీఎఫ్, ఈఎస్ఐ సదపాయం కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు పండించుకున్న పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించడంలో కేంద్రం విఫలమైందన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.చంద్రశేఖర్, కె.రామకృష్ణ, సాయిబాబా పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న వామపక్షాలు, ట్రేడ్ యూనియన్ నాయకులు

సమస్యలను నిర్ణీత గడువులోపు పరిష్కరించాలి

- కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): ప్రజల సమస్యలు నిర్ణీత గడువులోపు పరిష్కరించాలని నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు ఆదేశించారు. సోమవారం స్థానిక నగరపాలకలోని తన చాంబర్‌లో కమిషనర్ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వమించారు. పలువురు కాలనీల వాసులు తమ ఫిర్యాదులను అర్జీల రూపంలో కమిషనర్‌కు అందజేశారు. 21 అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో నగరపాలక ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వరరెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఆర్ఓ జునీద్, టిడ్కో అధికారి పెంచలయ్య, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, టీపీఎస్ మంజులమ్మ, డీపీఓ ఉమేష్ పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్ రవీంద్రబాబు

అర్జీల్లో కొన్ని..

- అసంపూర్తిగా ఉన్న రహదారిని పూర్తి చేయాలని 39వ వార్డు శ్రీనివాసనగర్‌కు చెందిన నాయుడు విన్నవించారు.
- జొహరాపురంలోని ప్రభుత్వ వాహన డ్రైవర్ల సంఘం కాలనీలో రహదారి నిర్మాణం చేపట్టాలని అసోసియేషన్ నాయకులు మురళీ, భాస్కర్ అర్జీలు ఇచ్చారు.
- 9 నెలల వేతన బకాయిలు చెల్లించాలని క్లాప్ ఆటో డ్రైవర్లు షఫీ, సుధాకర్, వేణు కోరారు.
- తమ కాలనీలో తాగునీటి పైపులైన్ ఏర్పాటు చేయాలని చెన్నమ్మ సర్కిల్ సమీపంలో ఉన్న పంచరత్న కాలనీకి చెందిన నాగలక్ష్మి, శేషయ్య, ఈశ్వరయ్య అభ్యర్థించారు.
- మున్సిపల్ స్థలం అన్యాక్రాంతం కాకుండా పార్క్ ఏర్పాటు చేయాలని రేణుకా నగర్, రాధ నగర్ కాలనీల వాసులు కోరారు.
- మురుగు కాల్వల నిర్మాణం చేపట్టాలని 29 వ వార్డు సప్తగిరినగర్‌కు చెందిన అలివేలు, కరుణ, జ్యోతి విన్నవించారు.
- డి మార్టు కాంప్లెక్స్ వారు మురుగు కాల్వను పూర్తిగా ఆక్రమించుకున్నారని స్థానికుడు భాస్కర్ ఫిర్యాదు చేశాడు.

నిబంధనల మేరకే బదిలీలు చేపట్టాం

- విద్యుత్ ఎస్ఈ ఉమాపతి

కర్నూలు న్యూసిటీ: నిబంధనల ప్రకారమే విద్యుత్ ఉద్యోగుల బదిలీలు నిర్వహించినట్లు ఏపీఎస్పీడీసీఎల్ పర్యవేక్షక ఇంజినీరు ఉమాపతి సోమవారం తెలిపారు. జిల్లాలోని విద్యుత్ అధికారులు ఏఈఈ, డిప్యూటీ ఈఈ, ఏఈ, ఈఈ, జూనియర్ ఇంజినీర్లు, సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్లు, అకౌంటెంట్ల బదిలీలు పారదర్శకంగా చేపట్టినట్లు వివరించారు. నాల్గవ తరగతి ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చామని, ఒకే చోట ఐదేళ్లు విధులు నిర్వహించిన వారికి, వ్యక్తిగత సమస్య ఉన్న వారికి బదిలీలు చేపట్టినట్లు వెల్లడించారు. బదిలీలు పొందిన ఉద్యోగులు తమ స్థానాల్లో రిపోర్టు చేసుకోవాలని సూచించారు.

బదిలీ అయిన వారు వీరే..

జిల్లాలోని ఎం అండ్ పీ కార్యనిర్వాహక ఇంజినీరు బి.మురళిధర్ బాబు తిరుపతి కార్పొరేషన్‌కు బదిలీ కాగా ఇక్కడికి పుత్తూరు నుంచి ఈఈ యం. చిన్న రెడ్డప్ప వచ్చారు. కర్నూలు హెచ్‌టీఎం/ఎస్‌డీ/డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు వి.వి.మోహన్ కుమార్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు.

డీఎస్ఓగా రాజారఘువీర్

కర్నూలు(సెంట్రల్): జిల్లా సివిల్ సప్లయ్ అధికారిగా రాజారఘువీర్ నియమితులయ్యారు. ఈయన ప్రస్తుతం తిరుపతి డీఎస్ఓగా పనిచేస్తున్నారు. ఇక్కడ పనిచేస్తున్న కేవీఎస్ఎన్ ప్రసాద్‌ను తూర్పుగోదావరికి బదిలీ చేశారు. కాగా డీఎస్ఓ రాజారఘువీర్ గతంలో కర్నూలు డీఎస్ఓగా, అర్బన్ ఏఎస్ఓగా పని చేశారు.

రోడ్లు, భవనాల శాఖలో బదిలీలు

కర్నూలు న్యూసిటీ: జిల్లాలోని రోడ్లు భవనాల శాఖలో సాధారణ బదిలీలు జరిగాయి. శాఖ పర్యవేక్షక ఇంజినీరు ఆర్.నాగరాజుతోపాటు జిల్లా కార్యాలయంలో పనిచేస్తున్న కార్యనిర్వాహక ఇంజినీరు సోనియాబింధు, ఆదోని ఈఈ క్రిష్టారెడి, మరో నలుగురు డీఈలు బదిలీ అయ్యారు. ఈఈ సోనుబింధు కడప సర్కిల్‌కు బదిలీ కాగా ఆమె స్థానంలో పులివెందుల ఈఈ సిద్దారెడి రానున్నారు. ఆదోని ఈఈ క్రిష్టారెడ్డి కడపకు బదిలీ కాగా ఆ స్థానానికి ఏపీఐఐసీ ఈఈ శ్రీనివాసమూర్తిని నియమించారు.

స్వర్ణాంధ్ర-2047 పోస్టర్ ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్): రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రజల భాగస్వామ్యంతో స్వర్ణాంధ్ర-2047 దార్శనికపత్రం రూపకల్పన చేయనున్నట్లు కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో కలెక్టర్ స్వర్ణాంధ్ర-2047 పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్ణాంధ్ర-2047లో ప్రజలు భాగస్వామ్యం కావాలన్నారు. ఇందుకోసం క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలు అభివృద్ధిపై తమ అభిప్రాయాలను తెలపవచ్చన్నారు. WWW.SWARNANDHRA.AP.GOV.IN ద్వారా సూచనల బాక్స్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా తమ అభిప్రాయాలు చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కల్యాణి, ఇన్‌చార్జ్ డీఆర్వో చిరంజీవి పాల్గొన్నారు.

పెళ్లీడు వయస్సు వచ్చాకే వివాహం చేయాలి

కర్నూలు(హాస్పిటల్): యువతీయువకులకు పెళ్లీడు వయస్సు వచ్చాకే వివాహం చేయాలని మాస్ మీడియా అధికారి శ్రీనివాసులు సూచించారు. స్థానిక ముజఫర్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వివాహ వయస్సుపై సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికలకు 18 ఏళ్లు, అబ్బాయిలకు 21 ఏళ్లు పూర్తయ్యేంత వరకు వివాహాలు చేసుకోకూడదన్నారు. బాల్య వివాహాల చేయడం వల్ల మానసిక, శారీరక సమస్యలు తలెత్తుతాయని, పోషకాహారలేమి ఏర్పడి రక్తహీనత వస్తుందని, చిన్నతనంలో గర్భం ధరించడం వల్ల గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, తల్లిదండ్రులతో పాటు హాజరైన వారిపై కూడా కేసు నమోదు చేస్తారన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు రామకృష్ణ, యశోద, స్వర్ణలత, ప్రాజెక్టనిస్టు ఖలీల్, ఆరోగ్య కార్యకర్త సునీత పాల్గొన్నారు.

నేడు మద్యం దుకాణ ఉద్యోగుల ధర్నా

కర్నూలు: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పించాలని కోరుతూ మంగళవారం ధర్నా నిర్వహించనున్నారు. ప్రభుత్వ మద్యం దుకాణాలను రద్దు చేసి ప్రైవేటు వారికి అప్పగించేందుకు రాష్ట్ర మంత్రి వర్గం ప్రకటన చేయడంతో అందులో పనిచేసే ఉద్యోగులను తొలగించే అవకాశముంది. జిల్లాలో ప్రస్తుతం 178 మద్యం దుకాణాలు ఉండగా ఒక్కో దుకాణంలో ముగ్గురు సూపర్‌వైజర్లు, ఇద్దరు చొప్పున సేల్స్‌మెన్లు పనిచేస్తున్నారు. ప్రైవేటు వ్యక్తులకు దుకాణాలు అప్పగిస్తే అందులో తమకు ఉపాధి కల్పించాలని కోరుతూ మంగళవారం చెన్నమ్మ సర్కిల్ నుంచి కల్లూరు శివారు హంద్రీ నది ఒడ్డున ఉన్న ఐఎంఎల్ డిపో వరకు నిరసన ర్యాలీ చేపట్టనున్నారు. ఇందుకు డిపో సూపరింటెండెంట్ సుధీర్ బాబును అనుమతి కోరుతూ లేఖ ఇచ్చినట్లు సమాచారం.

తిరుమల లడ్డూ కల్తీ ఆరోపణలను సీబీఐతో విచారణ చేయించాలి

- జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



కర్నూలు (టౌన్): తిరుమల తిరుపతి దేవస్థానం ఏడు కొండల వేంకటేశ్వర స్వామి లడ్డూ తయారీకి వాడే నెయ్యి కల్తీ చేశారంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈఓలు చేస్తున్న ఆరోపణలపై సీబీఐతో విచారణ చేయించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. సోమవారం సి.క్యాంపులోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ బాధ్యతాయుతమైన ముఖ్యమంత్రి హోదాలో ఉండి సీబీఐ లేదా సుప్రీం కోర్టు జడ్జి చేత విచారణ చేయించకుండా సిట్ విచారణ కోరడం వెనుక కుట్ర దాగి ఉందన్నారు. సిట్ విచారణ అంతా చంద్రబాబు కనుసన్నల్లో జరుగుతుందని ఆరోపించారు. గత జులై నెలలో నెయ్యిలో కల్తీ జరిగినట్లు రిపోర్టులు వచ్చాయని చెబుతున్న చంద్రబాబు నాయుడు అతి పవిత్రమైన అంశాన్ని పూర్తి స్థాయిలో విచారణ చేయకుండా మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డిపై ఆరోపణలు చేయడం తగదన్నారు.

సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయాలి

కర్నూలు(సెంట్రల్): కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలను తక్షణమే అమలు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. సోమవారం జొహరాపురంలోని 18వ వార్డు షద్రక్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మంచిప్రభుత్వం అంటూ ప్రజలను మోసం చేసేందుకు ఇంటికి వచ్చి స్టిక్కర్లను అంటించే టీడీపీ నాయకులను తరిమికొట్టాలన్నారు. ఎన్నికల హామీల్లో పెన్షన్ల పెంపు తప్ప ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఒక్కో విద్యార్థికి అమ్మకు వందనం పేరుతో రూ.15 వేలు, రైతు భరోసా రూ.20 వేలు, 18 ఏళ్ల నిండిన మహిళలకు నెలకు రూ.1,500, ఉచితబస్సు ప్రయాణం, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ ఎక్కడ చేశారని ప్రశ్నించాలని ప్రజలను కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేస్తున్నా.. కేంద్రాన్ని నిలదీయడంలో చంద్రబాబు విఫలమయ్యారని ఆరోపించారు. కడప స్టీల్ ప్లాంటు, విశాఖ రైల్వే జోన్లపై మాట్లాడాలని టీడీపీ నాయకులకు హితవు పలికారు.



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు(సెంట్రల్): జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, హాస్టళ్లు, కళాశాలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి అబ్దుల్లా డిమాండ్ చేశారు. సోమవారం పాత కంట్రోల్ రూం నుంచి కలెక్టరేట్ వరకు విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జూనియర్ కాలేజీల్లో మధ్యాహ్న భోజనాన్ని పెట్టాలని కోరారు. హాస్టళ్లలో విద్యార్థులకు కనీస వసతులను కల్పించాలన్నారు. జీఓ 117 రద్దు చేసి ఉపాధ్యాయుల సర్దుబాటును చేపట్టాలని, పెండింగ్‌లోని వసతి, విద్యా దీవెన నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మల్లేష్, కాజా, రాజు, యువరాజు పాల్గొన్నారు.



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

డీసీసీబీలో కర్షకవృద్ధి డిపాజిట్ పథకం



నూతన డిపాజిట్ పథకాన్ని ప్రారంభిస్తున్న సీఈవో విజయకుమార్

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్రబ్యాంకు ఆకర్షణీయమైన వడ్డీరేటుతో కర్షకవృద్ధి డిపాజిట్ పథకాన్ని తీసుకొచ్చినట్లు సీఈఓ విజయకుమార్ తెలిపారు. సోమవారం జిల్లా సహకార కేంద్రబ్యాంకు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 333 రోజుల డిపాజిట్‌పై సీనియర్ సిటిజన్‌కు 8 శాతం(ఎఫెక్టివ్ రేటు 8.22 శాతం), 60 ఏళ్ల లోపు వారికి 7.5 శాతం(ఎఫెక్టివ్ రేటు 7.67 శాతం) ఉంటుందన్నారు. ఈ పథకం నవంబరు 1వరకు అమలులో ఉంటుందని పేర్కొన్నారు.

ఒకేషనల్ కోర్సుల కోసం ప్రయత్నిస్తా

- కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించిన మంత్రి టీ.జి భరత్

కర్నూలు సిటీ: ప్రభుత్వ జూనియర్(టౌన్ మోడల్) కాలేజీకి మరిన్ని ఒకేషనల్ గ్రూప్‌లను మంజూరు చేయించేందుకు ప్రయత్నిస్తానని రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. సోమవారం టౌన్ మోడల్ కాలేజీలో నూతన కంప్యూటర్ ల్యాబ్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. తాను కూడా ఇదే కళాశాలలో చదువుకున్నానని, క్రమశిక్షణ, కృషీ, పట్టుదలతో చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుంకన్న, అధ్యాపకులు పాల్గొన్నారు.



ల్యాబ్‌ను ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్